క్లుప్తంగా

వైభవంగా పల్లకిసేవ



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామి, అమ్మవార్ల పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

మర్యాదపూర్వకంగా..



విజయసాయిరెడ్డిని కలిసిన వెంకయ్యనాయుడు

కొడవలూరు: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఆధ్వర్యంలో మండలంలోని కమ్మపాళేనికి చెందిన కాంట్రాక్టర్ బెల్లం వెంకయ్యనాయుడు శనివారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

• జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



సెల్ఫీ పాయింట్‌లో జేసీ

కోవూరు : 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ యువతకు పిలుపునిచ్చారు. కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో ఓటు హక్కు వినియోగంపై సెల్ఫీ పాయింట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 11వ తేదీ వరకు సెల్ఫీ పాయింట్ ఉంటుందని తెలియజేశారు. ప్రతిఒక్కరూ ఓటు ఆవశ్యకతను తెలుసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ అధికారులు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ గిరిజన సదస్సు



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : మండలంలోని పడుగుపాడు జాతీయ రహదారిపై శివాలయం ఎదురుగా ఉన్న మైదానంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ గిరిజన సదస్సు సోమవారం జరుగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఎంపీలు వేణుంబాక విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నెల్లూరు మేయర్ స్రవంతితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు.

నేదురుమల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరం



పొదలకూరు : మండలంలోని నేదురుమల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ముందుగా రక్త, బీపీ పరీక్షలు చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు శిబిరానికి హాజరయ్యారు.

సోమిరెడ్డికి ఓట్లడిగే అర్హత లేదు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కాకాణికి హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

మనుబోలు : ఎన్నికలప్పుడు తప్ప కనిపించని సోమిరెడ్డికి ప్రజలను ఓట్లడిగే నైతిక అర్హత లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని జట్లకొండూరు, చెర్లోపల్లి, గోవిందరాజపురం, బండేపల్లి, కుడితిపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే చివరి ఎన్నిక అని సోమిరెడ్డి ఓట్లు అడుగుతున్నారని, మళ్లీ పోటీ చేస్తాను అనే వారికే బాధ్యత ఉంటుంది కానీ చివరి ఎన్నిక అనే వ్యక్తికి ఏమి బాధ్యత ఉంటుందని ప్రశ్నించారు. సోమిరెడ్డికి ఓటు వేయాలని ఆయన కొడుకు, కోడలు తిరుగుతున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే వారు కనపడరని తెలిపారు. కరోనాతో ప్రజలు తల్లడిల్లిపోతుంటే సోమిరెడ్డి బెంగళూరు, హైదరాబాద్‌లలో తలదాచుకున్నాడన్నారు. కరోనా సమయంలో తాను మాత్రం అన్నిరకాలుగా నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచానని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలంగా ఉన్న సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కరించామన్నారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తితే సకాలంలో సాగునీటిని విడుదల చేయించి రైతులు నష్టపోకుండా చూశానన్నారు. ధాన్యం విషయంలో పారదర్శకంగా వ్యవహరించడం వల్లే ప్రస్తుతం ధాన్యం ధరలు గతంలో ఎన్నడూ లేనివిధంగా పెరిగాయన్నారు. సోమిరెడ్డి మాత్రం మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నట్టేట ముంచాడన్నారు. సోమిరెడ్డి లాంటి మోసగాడిని, అవినీతిపరుడిని నమ్మవద్దన్నారు. నిరంతరం ప్రజలకు అండగా ఉంటానని, ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. తొలుత స్థానిక నేతలు చేడిమాల బుజ్జిరెడ్డి, ఆవుల తులసీరాం, గుంజి రమేష్, ఆవుల వెంకట రమణయ్య తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాకాణికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్‌లు చేడిమాల శ్రీలత, నాగమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి, చిలకూరు మోహన్‌రెడ్డి, ఆవుల జగదీష్, యరమాపు శంకర్‌రెడ్డి, చెన్నూరు రామశేషారెడ్డి, చేడిమాల వెంకటసుబ్బారెడ్డి, ఇసనాక రాజారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడిని పలకరిస్తున్న మంత్రి కాకాణి

నేడు మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

పొదలకూరు : మండలంలోని భోగసముద్రం, చెన్నారెడ్డిపల్లి, నావూరు, నావూరుపల్లి గ్రామాల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి శనివారం వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

మెరుగ్గా వరి దిగుబడులు



ధాన్యం కొలతలు పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

ముత్తుకూరు : రబీ సీజన్‌లో సాగు చేసిన వరి ధాన్యానికి దిగుబడులు మెరుగ్గా వస్తున్నాయని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలో వివిధ రకాల వరి కోతలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీపీటీ ఎకరానికి 3.5 నుంచి 5 పుట్లు దిగుబడి అవుతోందన్నారు. పుట్టి ధర రూ.22 వేల నుంచి 23 వేల వరకు ఉందన్నారు. కేఎస్ఎం 1638 రకం వరి 3 నుంచి 4 పుట్ల వరకు దిగుబడి వస్తోందని వెల్లడించారు. ఆర్ఎన్ఆర్ 15048 రకం రూ.22 వేల నుంచి 23 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతులు ధైర్యంగా బయట మార్కెట్లో అమ్మకాలు చేసుకోవచ్చని సూచించారు. మార్కెట్లో ధరలు తక్కువగా ఉంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేసుకోవచ్చన్నారు. వీఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులపై వడ్డీ మాఫీకి నేడే చివరి అవకాశం

నెల్లూరు(బారకాసు): పన్నులపై వడ్డీ మాఫీ అవకాశం ఆదివారంతో ముగియనుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగాధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పన్ను చెల్లింపుదారులను కలిసి బకాయిలను వసూలు చేయాలని సూచించారు. కుళాయి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించి వారి మంచినీటి సరఫరా కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు.

ఆర్ఎంపీలకు గుర్తింపునివ్వాలని వినతి

నెల్లూరు(మినీబైపాస్) : ఆర్ఎంపీలకు ప్రభుత్వం గుర్తింపునివ్వాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

పక్కాగా టీకాలు వేయాలి



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

ముత్తుకూరు : గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు పక్కాగా వేయాలని జిల్లా క్షయ–కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. ముత్తుకూరులోని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యాధికారి దేవికృపతో చర్చించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న టీబీ పరీక్షలతో పాటు గర్భిణుల వివరాల నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. క్షయ, కుష్టు బాధితులకు పౌష్టికాహార పంపిణీని తనిఖీ చేశారు. ల్యాబ్‌లో జరిగే పరీక్షలు, మందుల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష జరిపారు. జిల్లా సూపర్‌వైజర్ శ్రావణ్‌కుమార్, హెచ్ఈఓ శాస్త్రి, ఆరోగ్య పర్యవేక్షకుడు కృష్ణంరాజు, ఫార్మసిస్టు మేరీ మమత పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై దాడులు

• నిందితుడి అరెస్ట్



పొదలకూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించి సుధాకర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు వివరాలు.. ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి సుధాకర్ వద్ద నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



కృష్ణపట్నం చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ముత్తుకూరు : ప్రశాంత ఎన్నికల నిర్వహణలో భాగంగా మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. కృష్ణపట్నం చెక్‌పోస్టును, అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్య కూడళ్ల వద్ద సంబంధిత స్టేషన్ల పోలీసు అధికారులు వాహన తనిఖీలు నిర్వహిస్తారన్నారు. చెక్‌పోస్టులలో షిఫ్టుల వారీగా పోలీసులు విధులు నిర్వహిస్తారని వెల్లడించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే సీ–విజిల్ యాప్ ద్వారా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఎస్పీ వెంట పలువురు పోలీసు అధికారులు పర్యటించారు.

విద్యుత్ ఆదాపై అవగాహన ర్యాలీ



ప్రిన్సిపల్ మహ్మద, ఉపాధ్యాయులు షకీల, వీరసేన, సూర్యనారాయణ, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు : స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు విద్యుత్ ఆదాపై కొడవలూరులో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.దేవసహాయం మాట్లాడుతూ సాధారణ ఫిలమెంట్ బల్బు కంటే ఎల్ఈడీ బల్బు తక్కువ విద్యుత్‌ను తీసుకుంటుందని చెప్పారు. ఏసీ వినియోగంలోనూ పొదుపు పాటించాలని సూచించారు. విద్యుత్‌ను ఆదా చేయడం ద్వారా ఖర్చు గణనీయంగా తగ్గడంతో పాటు విద్యుత్ కొరతను అరికట్టవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మహ్మద, ఉపాధ్యాయులు షకీల, వీరసేన, సూర్యనారాయణ, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపాళెంలో టీడీపీకి షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : మండలంలోని ఇస్కపాళెం పంచాయతీలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. గ్రామంలో మంచి పట్టున్న టీడీపీ నేత మల్లిశెట్టి చంద్రశేఖర్‌గౌడ్ ఆ పార్టీని వీడి తన మద్దతుదారులతో నెల్లూరులోని మంత్రి కాకాణి నివాసంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం చిరంజీవులగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, పార్టీ నేత అన్నం హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాథమిక అంశాలపై దృష్టి సారించాలి



విద్యార్థిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కోవూరు : ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సబ్జెక్టులకు సంబంధించి ప్రాథమిక అంశాలపై దృష్టి సారించాలని ఆటోడెస్క్ ఫ్రైడ్ నెట్‌వర్క్ కంట్రీ లీడ్ కృష్ణా చతుర్వేది తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో 16వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలన్నారు. కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరచుగా సాంకేతిక సదస్సులు, వర్క్‌షాపులు, కాన్ఫరెన్స్‌లు, వెబినార్లలో పాల్గొనాలని తెలిపారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కళాశాల కోశాధికారి వై.విజయశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో స్థానిక నాయకులు గజ్జల లింగారెడ్డి, దినకర్‌రెడ్డి నివాసంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి భారీ సంఖ్యలో నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణయ్య, కళ్యాణ్, బాబు, సుబ్బయ్య, లక్ష్మయ్య, చాన్‌బాషా, శ్రీనివాసులు, మోహన్, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగం వెంకయ్య, ఎంపీటీసీ కూనంగారి రమణయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, షబ్బీర్, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, పామంజి శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ బీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి జరగాలంటే జగనన్నే సీఎం కావాలి



కొడవలూరు : నార్తురాజుపాళెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు



పొదలకూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

కొడవలూరు : పేదలకు మంచి జరగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. మండలంలోని నార్తురాజుపాళెం మెయిన్, అరుంధతీయవాడల్లో ఆయన శనివారం సాయంత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేశారని, ఏ రాష్ట్రంలోనూ పేదల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన దాఖలాల్లేవన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, పేదలు సంతోషంగా ఉండాలన్నా వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎస్.మాణిక్యరావు, జి.జనార్దన్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, జి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో..

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని తెలియజేసే కరపత్రాలను పామూరు లచ్చారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు అందజేశారు. సంక్షేమ పాలన కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పి.నారాయణరెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన



పూజితను సన్మానిస్తున్న నాయకులు

పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత గత ఆరు రోజులుగా పొదలకూరు పట్టణంలో చేస్తున్న ఇంటింటి ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన వస్తోంది. అధిక సంఖ్యలో మహిళలు ఆమె వెంట నడుస్తూ ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం శివాలయం, మస్తాన్‌రెడ్డినగర్, మారుతీనగర్ వీధుల్లో ప్రచారం చేశారు. తొలుత శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రూ.కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసిన తన తండ్రి కాకాణిని ఆశీర్వదించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీటీసీ జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు అంజాద్, కె.సరోజనమ్మ, నాయకులు మూలి సతీష్‌రెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎం.శేఖర్‌బాబు, డి.విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.ఆనంద్‌రావు, పి.శంకరయ్య, శ్రీనివాసులుగౌడ్ పాల్గొన్నారు.

మేలుజాతి పశు ఉత్పత్తిపై అవగాహన



పశువైద్యంపై అవగాహన కల్పిస్తున్న ఏడీ

కోవూరు : మేలుజాతి పశు ఉత్పత్తిపై పాడి రైతులకు అవగాహన కల్పించేలా పశు సహాయకులు చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో పశు సహాయకులకు శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సహాయకులు వారి పరిధిలో ఉన్న పాడి రైతులకు పశు సంపద అభివృద్ధిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా తగిన చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోవూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన పశు సహాయకులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో శనివారం జరిగింది. నాయుడుపేటకు చెందిన కృష్ణమోహన్ పనినిమిత్తం మోటారు బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా, చెముడుగుంట సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణమోహన్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.